క్లుప్తంగా

రాగుల సాగుపై రైతులకు శిక్షణ



ములగపూడిలో రైతులకు శిక్షణ ఇస్తున్న పెద్దాపురం ఏడీఏ భ్రమరాంబ

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో రైతులకు గురువారం రాగులు సాగుపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ సౌజన్యంతో గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన ఈ శిక్షణలో పెద్దాపురం ఏడీఏ భ్రమరాంబ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు శిక్షణ ఇచ్చారు. రాగులు పంట సాగు చేసే విధానం, ప్రాముఖ్యత, సాగులో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యామల సురేష్, ఏఓ రెడ్డి ఈశ్వరరావు, ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ లహరి, పలువురు రైతులు పాల్గొన్నారు.


ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



శృంగవరంలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి అరుణ్‌కుమార్

రౌతులపూడి: మండలంలోని రైతులకు గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. శృంగవరంలో ఆయిల్ పామ్ తోటలను మండల ఉద్యానవనశాఖ అధికారి పి.అరుణ్‌కుమార్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయల్ పామ్ సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. ఆయిల్ పామ్‌లో నాలుగేళ్ల పాటు అంతర పంటలుగా అరటి, కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థినికి గోల్డ్ మెడల్



నిర్వాహకుల నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న సంజన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థినికి గోల్డ్ మెడల్ వచ్చినట్టు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ విలాస్ అనిల్‌చవాన్ తెలిపారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో ఈ నెల 16న రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథలాన్, ట్రయాథలాన్, బయాథలాన్, ఛాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థిని గాలి అఖిల సంజన పాల్గొని ట్రయాథలాన్ (షూట్+ఈత+పరుగు) మహిళా జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించినట్టు వివరించారు. సంజనకు మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ బి. శ్రీనివాసకుమార్ గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కళాశాల సిబ్బంది సంజనకు అభినందనలు తెలిపారు.

అన్నదానం

గోకవరం: స్థానిక శ్రీస్కంద బాలాజీ సూర్యదేవాలయ ప్రాంగణంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. వ్యాస జయంతిని పురస్కరించుకుని సనాతన ధర్మప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పట్నాల నాగేంద్ర సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజా, సభ్యులు కొత్తపల్లి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు, కొరిపిల్లి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి... తగ్గిన ఆసక్తి

- తెల్లబంగారం సాగుపై మొగ్గు చూపని అన్నదాతలు
- మెట్టలో భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్న రైతులు



ఎన్.చామవరంలో సాగు చేస్తున్న పత్తి పంట

తుని రూరల్: మెట్ట రైతుల పాలిట తెల్లబంగారంగా విరాజిల్లుతున్న పత్తిసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతుంది. తెగుళ్లు, తుపానులు, పెరిగిన పెట్టుబడులు, కోత కూలీల కొరత ప్రభావంతో పత్తిసాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ఐదేళ్ల సాగును ప్రమాణికంగా తీసుకుని వ్యవసాయశాఖ అధికారులు సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం గత కొన్నేళ్లగా పత్తి సాధారణ సాగు జరగడం లేదు. వేల ఎకరాల నుంచి వందల ఎకరాలకు సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఆరేళ్ల కిందట వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో తొమ్మిది వేల ఎకరాల్లో సాగయ్యే పత్తి ప్రస్తుతం వందల ఎకరాలకు పడిపోయింది. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం మరింత దిగజారి 500 లోపు ఎకరాలకు వచ్చేసింది. పంట కాలంలో తరచూ వరదలు, తుపాన్లు సంభవించడం, తెగుళ్లు, గులాబీ పురుగుల ఉధృతి, పంట మార్పిడి చేయాలన్న అధికారుల సూచనలు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంతో పత్తి సాగు విస్తీర్ణం తగ్గుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. పత్తిసాగు చేసే రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, కూరగాయలు, వరి, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడులు భారం

ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి రైతులు పత్తి సాగు చేస్తున్నారు. వరదలు, తుపాన్లు, తెగుళ్ల ప్రభావంతో అధికంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.26 వేల నుంచి రూ.30 వేలు పెట్టుబడులు పెట్టినా పంట చేతికి అందుతుందన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లింది. అరకొరగా పత్తి పంట చేతికి అందినా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోపక్క విత్తనాలు విత్తేందుకు, కలుపు నివారణకు, పత్తి సేకరణకు అవసరమైన కూలీలు అందుబాటులో ఉండడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు వెళుతున్నారు. ఫలితంగా మెట్టలో తెల్ల బంగారం (పత్తి) సాగు ప్రశ్నార్థకమవుతోంది.

అల్పపీడనంతో ఆందోళన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు పత్తి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ సంవత్సరం రైతులు ఆలస్యంగా పత్తినాట్లు వేశారు. ఇప్పుడిప్పుడే మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయి. ఈ దశలో వర్షాలు కురిస్తే పదునెక్కువై మొక్కలు గిడసభారడంతో పాటు పూత, పిందె, కాయలు నేలరాలుతాయి. ఫలితంగా పత్తి దిగుబడి తగ్గిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

వరి సాగు చేస్తున్నా

కొన్ని దశాబ్దాల పాటు పత్తిసాగు చేశాను. వరదులు, తెగుళ్లతో పంట నష్టపోతున్నాను. కొన్నేళ్లగా పత్తిపంటతో నష్టాలు వస్తున్నాయి. పెట్టుబడులు, కూలీల సమస్యలు అధికమయ్యాయి. నాలుగేళ్లగా పుష్కర కాలువ నుంచి సాగునీరు అందుతోంది. దీంతో పత్తికి బదులుగా వరిపైరు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం పుష్కర కాలువ నుంచి చెరువుకు, చెరువు నుంచి పంటపొలానికి నీరు వస్తుందన్న ఆశతో పత్తి వేయకుండా ఖరీఫ్‌లో సాగు చేసేందుకు వరినారు వేశాను.

– పదిలం పెదకాపు, అగ్రహారం, తుని మండలం

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

మెట్టలో రైతులు పత్తిసాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ఒకే పంట సంవత్సరాల కొలది సాగుచేస్తే భూమి సారం కోల్పోతుంది. తెగుళ్లు, పురుగులు ఉధృతి పెరిగి పంట దిగుబడులు తగ్గిపోతాయి. రెండేళ్లకు ఒకసారైన పంట మార్పిడి చేయాలి. గిట్టుబాటు ధరలు, మార్కెట్ డిమాండ్‌కు అనువుగా పంటలు సాగు చేయాలి. వరదలు, తుపాన్లు తట్టుకునే విధంగా పత్తిలో నీటి పారుదల ఏర్పాట్లు చేసుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

తుని సబ్ డివిజన్‌లో మండలాల వారీగా సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	2023లో సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	2024లో సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
తుని	575	812	255
కోటనందూరు	23	6	00
తొండంగి	80	107	00
రౌతులపూడి	531	451	212
శంఖవరం	207	120	00
మొత్తం	1416	1496	467



అగ్రహారంలో పత్తికి బదులు నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన వరినారుమడి

మహిళల పరిరక్షణే ధ్యేయం



బూరుగుపూడిలో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, మహిళలు

కిర్లంపూడి: మహిళల పరిరక్షణే మిషన్ శక్తి ప్రధాన ధ్యేయమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. మిషన్ శక్తిలో భాగంగా గురువారం మండలంలోని బూరుగుపూడి ప్రభుత్వ పాఠశాలలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రత, సాధికారతే మిషన్ శక్తి ప్రధాన లక్ష్యమన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు సూక్ష్మ రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. బాలికలు, చిన్నారులపై మానవ మృగాలు చేస్తున్న లైగింక దాడులను అడ్డుకోవడానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలన్నారు. మహిళలు, బాలికల సంరక్షణా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు, బాల కార్మిక నివారణ నిర్మూలనకు కృషి చేసే బాధ్యత తీసుకుంటామని సదస్సుకు వచ్చిన మహిళలు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నక్కా ఆశపు బద్రి, పాతంశెట్టి రవి, పాతంశెట్టి కొండబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు, హెచ్‌ఎం అన్నపూర్ణ, వైద్య సిబ్బంది ఖరీం మునీషా తదితరులు ఉన్నారు.

వాహనాలకు బహిరంగ వేలం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కార్యాలయంలో గురువారం వివిధ సారా కేసుల్లో పట్టుబడిన నాలుగు మోటారు సైకిళ్లకు బహిరంగ వేలం నిర్వహించారు. సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.శ్రీరంగం దొర సమక్షంలో నిర్వహించిన వేలంలో నాలుగు మోటారు సైకిళ్లను పాటదారులు రూ.72 వేలకు దక్కించుకున్నారు. స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవితో పాటు 15 మంది వేలంలో పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తి కాటం భాను, న్యాయవాదులు

- న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి కాటం భాను ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు వద్ద ర్యాలీని న్యాయమూర్తి కాటం భాను ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. అంబేడ్కర్ కళామందిర్ మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ ర్యాలీ కొనసాగింది. అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కాటం భాను మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు హెల్మెట్, కార్లలో సీటు బెల్ట్ విధిగా ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే దండన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ అడ్వకేట్లు బుగత శివ, బొంగుభూరి మధుబాబు, అవసరాల దేవి, మల్లేశ్వరరావు, రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు, పోలీసు - కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాకర్స్‌క్లబ్ ముందంజ



తుని బాలికల జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న ప్రభావతి, వాకర్స్ ప్రతినిధులు

తుని: పేదలు, బడుగు, బలహీన వర్గాలు, సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న తుని వాకర్స్ హెల్త్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందని ఇంటర్నేషనల్ ఎలెక్ట్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. స్థానిక బ్యాంకు కాలనీ బాలికల జూనియర్ కళాశాలలో 50 మంది బాలికలకు గురువారం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. సరస్వతీ శిశుమందిర్‌లోని 130 మంది విద్యార్థులకు నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని ప్రభావతి సూచించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ గవర్నర్ చదరం శివాజీ, గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు, నాగేశ్వరరావు, ఎస్.తాతారావు, కుందెం సత్యనారాయణ, నాగేంద్ర, సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై మహిళలకు శిక్షణ



శిక్షణలో అందజేసిన విత్తనాలు, నారుతో మహిళలు

గోకవరం: జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కామరాజుపేటలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై గురువారం అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంటీ ఎల్ దేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమతుల్య పోషకాహారం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, శరీరానికి కావలసిన పోషక పదార్థాలు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ల గురించి వివరించారు. వీటి కోసం పెరటిలోనే చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని సూచించారు. దీనిలో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో 12 రకాల పెరటి తోటల విత్తనాలు, నారు మహిళలకు అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, మంగారత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు జరుగుతాయన్నారు. దీంతో సాయినగర్, మార్కండ్రాజుపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

కోటనందూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. కోటనందూరు రూరల్ ఫీడర్ పరిధిలోని కోటనందూరు, అల్లిపూడి, కేఏ మల్లవరం, కేఓ అగ్రహారం, కేఈ చిన్నయ్యపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జగ్గంపేట: జగ్గంపేట, కాట్రావులపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈ రత్నాలరావు గురువారం తెలిపారు. జగ్గంపేట, కాట్రావులపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గుర్రంపాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, భావవరం, నరేంద్రపట్నం,

సూరంపాలెం, తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజా రాజబాబు పార్కులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని: పట్టణ ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు గాను పార్కులను అభివృద్ధి చేస్తున్నట్టు తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో రూ.80 లక్షలతో చేపట్టనున్న పనులకు గురువారం సాయంత్రం ఆమె శంకుస్థాపన చేశారు. దశల వారీగా పట్టణ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేస్తామని దివ్య తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, కమిషనర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గెస్ట్ ప్రాతిపదికన జువాలజీ లెక్చరర్‌గా పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ జువాలజీలో 55% మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

బొద్దవరంలో ఫెర్టిలిటీ క్యాంపు



పాడి రైతుకు మందులు అందజేస్తున్న ఏడీఏ శ్రీధర్ తదితరులు

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ), పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పశువుల సంతానోత్పత్తి (ఫెర్టిలిటీ) క్యాంపు నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ తుని సహాయ సంచాలకులు డాక్టర్ వడ్డి శ్రీధర్ స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ పశువైద్య శిబిరంలో 45 గేదెలు, 32 ఆవులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. యదకు రాని పశువులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్ పాడిపశువుల సంతానోత్పత్తి పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ కల్యాణి, పశువైద్యాధికారులు రత్నతేజ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజు చెరువుకు ఏలేరు జలాల విడుదల



ఏలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: ఏలేరు జలాశయం నుంచి తిమ్మరాజుచెరువుకు గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ప్రాజెక్టు నుంచి 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల ద్వారా సుమారు ఆరు వేల ఎకరాలకు పైగా నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జ్యోతుల పెదబాబు, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో ఇక్కట్లు



కిర్లంపూడిలో తూముకు అడ్డంగా పేరుకుపోయిన చెత్త

కిర్లంపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాలువలో చెత్త, వ్యర్థాలు కొట్టుకొచ్చి తూముకు అడ్డుపడడంతో కాలవలోని నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సింహాద్రిరాజు కాలువలో పేరుకుపోయిన తుప్పలను గురువారం ప్రొక్లెయిన్‌తో శుభ్రం చేశారు. వర్షాలకు ఎగువ ప్రాంతంలో తొలగించిన తుప్పలు, కాలువ పక్కన ఉండే చెత్త కొట్టికొచ్చి కిర్లంపూడిలోని గ్రామం మధ్యలో తూముకు అడ్డుపడంతో నీరు రోడ్డుపైకి వచ్చి చేరింది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు నీటి నుంచి వచ్చే పురుగులు, విష సర్పాలు ఎక్కడ ఇళ్లలోకి వస్తాయనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

జగ్గంపేట: అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మెట్ట ప్రాంతంలో వరి నారుమళ్లు, నాట్లు వేసిన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ సూచించారు. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించిందన్నారు. మెట్టలో పలు చోట్ల రైతులు వెదజల్లు విధానంలో వరిసాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ ఉంటే పంట దెబ్బతింటుందని చెప్పారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

కిర్లంపూడి: ఏకదాటిగా కురుస్తున్న వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ జోకా అమృత సూచించారు. విత్తనాలు చల్లిన నారుమడి నీరు మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. వీలైనంత తొందరగా నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నష్ట నివారణకు 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. అధిక వర్షాలకు పంట తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటిలో 1 గ్రాము కార్బెండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమం పిచికారీ చేయాలని సూచించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతా కుమారి

జగ్గంపేట: మహిళలు, బాలికలు, చిన్నారులపై జరుగుతున్న అరికట్టాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో గురువారం జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో అలజడి



దానవాయిపేటలో సముద్రతీరానికి చేర్చిన బోట్లు



అద్దరిపేట సముద్ర తీరంలో ఎగసి పడుతున్న అలలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని సముద్ర తీరంలో అలల ఎగసి పడుతున్నాయి. రెండు రోజుల నుంచి వాతావరణం మాగుడుగా ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఉక్కబోతగా ఉంది. గురువారం ఉదయం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉండగా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మరికొద్ది రోజులపాటు ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. కాగా దానవాయిపేట, అద్దరిపేట, వాకదారిపేట, కొత్తచోడిపల్లిపేట, యర్రయ్యపేట తదితర సముద్ర తీరాల్లో అలలు ఉధృతి ఎక్కువగా ఉంది. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తీరానికి చేరుకోవాలని సమాచారం అందించినట్టు తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రతికూల వాతావరణంలో మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదన్నారు. కాగా తీరప్రాంతాల మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.